సాక్షి
ప్రకాశం
గురువారం । 27 । జూలై । 2023



అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. 46 రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. - 8లో..



తప్పిన పెనుప్రమాదం

ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రైవేటు బస్సు పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన కొమరోలు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
26/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పారా బ్యాడ్మింటన్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఉలవపాడు: రాష్ట్ర స్థాయి సీనియర్, జూనియర్ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించడానికి క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఉలవపాడు క్రీడాకారుడు, పారా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా కార్యదర్శి రామస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2 లోపు సెల్: 9390131777 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 15 న విశాఖపట్నంలో జరిగే దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగ క్రీడాకారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

వైద్య సేవలపై కేరళ బృందం సంతృప్తి



డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న రీసెర్చ్ పాపులేషన్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఎనీమియా మానిటరింగ్ బాగుందని పాపులేషన్ రీసెర్చ్‌కు చెందిన ఆరోగ్య మిషన్, పీఐపీ మానిటరింగ్ టైమ్ డాక్టర్లు అనిత, సబిత అన్నారు. కేరళకు చెందిన ఈ బృంద సభ్యులు బుధవారం జిల్లాలో పర్యటించారు. జిల్లా ఆస్పత్రి, పొదిలి సామాజిక ఆస్పత్రి, కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మరో ఉప ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి చాంబర్‌లో హజారే జిల్లాలో గుర్తించిన ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్స్ గురించి అధికారులతో చర్చించారు. వారి పరిశోధనలో గుర్తించిన అంశాలపై నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల డా.వాణిశ్రీ,, డా.శ్రీవాణి, డీపీవో సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ నిర్వాసితులకు సత్వర న్యాయం

- జేసీ శ్రీనివాసులు



స్థలాలు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, పక్కన సబ్ కలెక్టర్ సేతు మాధవన్

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సత్వర న్యాయం లభించేలా చూస్తానని జేసీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన గొట్టిపడియ నిర్వాసితులకు ఇచ్చే ఇళ్ల స్థలాల ప్రాంతమైన వేములకోట లేఅవుట్, గుండంచర్ల గ్రామస్తులకు ఇచ్చే దేవరాజుగట్టు లేఅవుట్, సుంకేసుల గ్రామస్తులకిచ్చే తోకపల్లి, కలనూతల నిర్వాసితులకు ఇచ్చే ఇడుపూరు-1,2, సుంకేసుల గ్రామస్తులకు ఇచ్చే గోగులదిన్నె లేఅవుట్లను సబ్‌కలెక్టర్ సేతు మాధవన్‌తో కలిసి పరిశీలించారు. వేములకోట వద్ద నిర్మిస్తున్న గొట్టిపడియ ఆర్‌ఆర్ కాలనీ వద్ద గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మా వెంకటరెడ్డి, కుందురు వెంకటరెడ్డి, గోపు శ్రీను తదితరులు మాట్లాడుతూ త్వరగా తమకు పట్టాలిచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. గొట్టిపడియ గ్రామంలో తమకున్న పొలాల్లో ఈ ఏడాది పంటలు సాగుచేసుకునేందుకు అవకాశముంటే పరిశీలించాలని జేసీని కోరారు. త్వరలో ముంపు గ్రామాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేస్తానని జేసీ చెప్పినట్లు తుమ్మా వెంకటరెడ్డి తెలిపారు.

గూడులేని పేదల కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని 'మహాయజ్ఞం'లా చేపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఒంగోలు నగరంలో పేదలందరికీ ఒకే డిజైన్ లో ఇళ్లు నిర్మించి శాటిలైట్ సిటీని రూపొందించాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తలంచారు. దీనికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సైంధవుడిలా అడ్డుపడ్డారు. తన అనుచరులతో న్యాయపరమైన ఇబ్బందులు సృష్టించారు. ఫలితంగా పేదలు సొంతగూడుకు దూరమయ్యారు. ఒక వైపు దేశం నేతల కుట్రలు ఎదుర్కొంటూనే మరో వైపు పేదలకు ఎలాగైనా గృహాలు నిర్మించాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే బాలినేని అడుగులు వేశారు. దీనికి సీఎం నుంచి సానుకూలంగా స్పందన రావడం, భూముల కొనుగోలుకు రూ. 200 కోట్లు మంజూరు చేయడం చకచకా జరిగిపోయాయి. నగర పరిసరాల్లో 508 ఎకరాల భూసేకరణ కూడా జరిగిపోయింది. ఇలా పచ్చ నేతలకు బాలినేని షాక్ ఇచ్చారు.

పేదల ఇళ్ల కోసం తగ్గేదేలే..!

- పచ్చ నేతలకు బాలినేని షాక్
- పేదలకు ఇళ్లపై టీడీపీ కుట్రలు
- యరజర్లలో శాటిలైట్ టౌన్‌షిప్‌ను అడ్డుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల
- న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి కుట్రలు పన్నిన వైనం
- అయినా వెనక్కు తగ్గని బాలినేని
- ప్రైవేట్ భూములు సేకరించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు
- అందుకోసం సీఎం జగన్ రూ.200 కోట్లు కేటాయింపు
- అగ్రహారం, వెంగముక్కలపాలెంలో 508 ఎకరాల సేకరణ
- 28 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సన్నద్ధం
- సీఎం జగన్ చేతుల మీదుగా పట్టాల పంపిణీకి బాలినేని కసరత్తు



యరజర్ల వద్ద ఏర్పాటు చేసిన జగనన్న శాటిలైట్ టౌన్‌షిప్ లేఅవుట్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేనివిధంగా ఒకేచోట భారీ స్థాయిలో ప్రభుత్వ భూమిని సేకరించి నగరంలోని వేలాది మంది పేదలకు ఇళ్లు నిర్మించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భావించారు. కొత్తగా ఒక శాటిలైట్ సిటీని నిర్మించాలని అనుకున్నారు. నగర శివారు యరజర్ల గ్రామంలో 818 ఎకరాలు సేకరించారు. దాదాపు 23,531 మందికి సొంత ఇంటి కల నిజం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. హద్దురాళ్లు కూడా వేయించారు. ఇది పచ్చనేతలకు కంటగింపుగా మారింది. ఇంతమంది నిరుపేదలకు ఇళ్లు ఇస్తే తన రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని భావించి కుట్రలకు తెరతీశారు. తన ప్రధాన అనుచరుడైన ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మక్కెన శ్రీనివాసరావు చేత హైకోర్టులో కేసు వేయించారు. గతంలో ఈ స్థలాన్ని ఐరన్ ఓర్ మైనింగ్‌కు ఇచ్చారని హైకోర్టుకు వెళ్లాడు. దీంతో హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. దీనిపై పేదలు దామచర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీ రాజకీయ భవిష్యత్‌కు మేము బలికావాలా అంటూ నిలదీస్తున్నారు. ఇళ్లులేని నిరుపేదలపై టీడీపీకి ఎందుకింత కక్ష అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు.

పేదల ఇళ్ల కోసం ఎందాకైనా అంటున్న బాలినేని...

టీడీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి తీరాలన్న దృఢ సంకల్పంతో బాలినేని శ్రీనివాస రెడ్డి అడుగులు ముందుకేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేటు భూములు కొనుగోలు చేసైనా ఇళ్లు ఇద్దామని సీఎం భరోసా ఇచ్చారు. రైతుల వద్ద భూములు కొనుగోలు చేయటానికి రూ.200 కోట్లు విడుదల చేశారు. దీంతో రెవెన్యూ అధికారులను రైతుల నుంచి భూములు కొనుగోలు చేసేందుకు బాలినేని పరుగులు పెట్టించారు. అగ్రహారం, వెంగముక్కల పాలెంలలో భూముల సర్వే చేపట్టారు. రైతుల వద్ద నుంచి 508 ఎకరాలు కొనుగోలు చేశారు. లే అవుట్లకు రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో ఇళ్లులేని నిరుపేదలు 23,531 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పుడా సంఖ్య 28 వేలమందికి చేరింది. అయినా సరే వెనక్కి తగ్గేదే లేదంటూ దరఖాస్తు చేసుకున్న అందరికీ పట్టాలు ఇచ్చి ఇళ్లు కూడా నిర్మించాలన్న నిర్ణయంతో బాలినేని అడుగులు ముందుకేస్తున్నారు.

టీడీపీ అడ్డుకోవటం... పేదలకు మంచే జరిగింది:

యరజర్లలో శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని తలిస్తే దానిని పూర్తి కానీయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ నేతలు పేదలకు చెడుచేయాలని తలంచినా... అంతా మన మంచికే అన్న చందంగా నిరుపేదలకు ఇంకా మేలే జరిగింది. అక్కడి టౌన్‌షిప్ ఆగిపోవటంతో బాలినేని అగ్రహారం, వెంగముక్కల పాలెంలలోనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పూనుకున్నాడు. దీంతో ఇప్పుడు ఇవ్వదలచుకున్న ప్లాట్లు ఇంకా ఒంగోలు నగర పరిధిలోనే కావటంతో సొంతింటి కల నెరవేరుతున్న నిరుపేదల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. పేదలకు సేవ చేయాలనే నాయకుడి సంకల్పం బలంగా ఉండాలే కానీ పేదలకు ఎప్పుడూ అన్యాయం జరగదు అని ఈ ఉదంతంతో తేటతెల్లమైంది. బాలినేని శ్రీనివాస రెడ్డి సంకల్పం బలంగా ఉంది కాబట్టే ప్రైవేటు భూములు కొనుగోలు చేసి ఇచ్చేందుకు అన్నీ సిద్ధం చేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా పట్టాలు ఇప్పిస్తా



ఒక్క ఎకరా కూడా ప్రైవేటు భూమి కొనుగోలు చేయకుండా ప్రభుత్వ భూమిలోనే పెద్ద ఎత్తున యరజర్ల వద్ద ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలనుకున్నాం. రాష్ట్రంలోనే ఏ జిల్లాలో కూడా ఇంతపెద్ద ప్రభుత్వ స్థలం లేదని, ఒంగోలులోనే ఇది సాధ్యమైందని అందరూ భావించారు. అయితే రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం యరజర్లలో శాటిలైట్ టౌన్ షిప్‌ను మాజీ ఎమ్మెల్యే దామచర్ల అడ్డుకున్నాడు. న్యాయపరమైన అడ్డంకులు సృష్టించాడు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి తీరుతాం. అందుకే అగ్రహారం, వెంగముక్కల పాలెంలలో 508 ఎకరాలు కొనుగోలు చేయించాం. ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేసింది. త్వరలో లే అవుట్లు సిద్ధం చేయిస్తాం. సొంత ఇంటికల నెరవేర్చి నిరుపేదల కళ్లలో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి లక్ష్యం. త్వరలో సీఎం జగన్ చేతుల మీదుగా పేదల పట్టాల పంపిణీ చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

విదేశీ విద్యాదీవెనకు 21 మంది ఎంపిక

ఒంగోలు: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి సంబంధించి 21 మంది ఎంపికయ్యారని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ నోడల్ అధికారి ఎన్.లక్ష్మానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరత్నాల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఎస్‌సీ/ఎస్‌టీ/బీసీ/ఈబీసీ /మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కల్పించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకానికి 24 జిల్లాల పరిధిలో 357 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి 2022–23 విద్యా సంవత్సరానికి 15 మంది, 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరుగురు వెరసి 21 మంది ఎంపికైనట్లు తెలిపారు. జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, యూఎస్‌ఏలలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిధులు విడుదల చేస్తారన్నారు. సహాయ సంక్షేమశాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజాప్రతినిధులు, ఎంపికైన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు విరివిగా పాల్గొనేలా చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ నోడల్ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఎస్‌సీ–1, బీసీ–2, ఈబీసీ–12 ఎంపికయ్యారని వీరికి రూ.1,68,13,000 నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్‌టీ 1, బీసీ 2, ఈబీసీకి ముగ్గురు ఎంపికయ్యారని వీరికి రూ.78,71,573. 50 విడుదల చేస్తారన్నారు. మొత్తంగా 21 మందికి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,46,85,473.50 విడుదల చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం ప్రకాశం భవనంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాలులో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అనంతరం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తారని , మెగా చెక్కును పంపిణీ చేస్తారని చెప్పారు.

సురక్షతో ప్రతి ఒక్కరిలో సంతోషం

- చుక్కల భూముల పరిష్కారంతో సుజాత నగర్ వాసుల్లో ఆనందం
- త్వరలోనే సమతానగర్‌లో రూ.40 లక్షల పనులకు తీర్మానం
- 37వ డివిజన్‌లో 676 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు
- జగనన్న సురక్ష పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఇంటిలో సంతోషాన్ని కలిగిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక 37వ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ఓ చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఏటా ధ్రువపత్రాల కోసం ఎంతోమంది అటు తహసీల్దార్ కార్యాలయాలు, ఇటు మున్సిపల్ కార్యాలయాల వద్దకు తిరుగుతుండేవారన్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగడం అటుంచి ప్రతి ధ్రువపత్రానికి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాల్సి వచ్చేదని, కానీ నేడు పైసా ఖర్చులేకుండా తిరిగే పని లేకుండా నేరుగా మీ ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి మీ సమస్యను తెలుసుకుని పత్రాలు అందించేందుకు చేస్తున్న కృషి దేశచరిత్రలోనే ప్రథమం అన్నారు. సుజాతనగర్ భూములు కొన్ని ఎండోమెంట్ జాబితాలో గత ప్రభుత్వం చూపించడంతో వాటిని అమ్ముకునే అవకాశం లేకపోవడం, ఇంకో వైపు అవసరానికి అప్పుకూడా పొందలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయితే దీనిపై జగనన్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చుక్కల భూముల జాబితా నుంచి వాటిని తొలగించడంతో నేడు వాటిపై సర్వహక్కులు కల్పించిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ డివిజన్‌లోని రెండు సచివాలయాల పరిధిలో ఏకంగా 3500 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేయడంతోపాటు 676 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయన్నారు. ఇంకా ఎవరికైనా ఇళ్లపట్టాలకు అర్హత ఉండి, మంజూరు కానివారు ఉంటే తెలియజేయాలన్నారు. వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, అయితే తెలుగుదేశం పార్టీ వారు కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో ఆ ప్రక్రియకు ఆటంకం ఏర్పడిందన్నారు. అయితే తాజాగా రూ.200 కోట్లు వెచ్చించి స్థలాలను సిద్ధం చేశామని, ఆగస్టులో ముఖ్యమంత్రి చేతులమీదుగా అందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 37వ డివిజన్‌లో త్వరలోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని , అందులో ప్రతి ఇంటికి వచ్చి మీ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానన్నారు. సమతానగర్‌లో రోడ్లు, డ్రైనేజీల సమస్యకు సంబంధించి రూ.40 లక్షల పనులను త్వరలో జరిగే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించి పరిష్కరిస్తామన్నారు. అంతే కాకుండా ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే త్వరలోనే తాను శ్రీసత్య చానల్, వీ చానల్‌లో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, వారి గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ స్వయంగా వలంటీర్లకు నూతన మొబైల్స్‌ను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ యం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, టైలర్ల సంక్షేమ బోర్డు రాష్ట్ర చైర్మన్ షేక్ సుభానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, ఘంటా రామానాయుడు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పరవళ్లు తొక్కుతున్న నెమలిగుండంలోని జలపాతం

నల్లమలలో భారీ వర్షం

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గుండ్లకమ్మవాగు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. గుండ్లకమ్మ వాగు నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం మీదుగా రామన్న కతువకు చేరుకుంటుంది. ఈ గుండ్లకమ్మవాగు నీరు చోళ్లవీడు, చినగానిపల్లె గ్రామాల్లో ఉన్న చెరువులకు చేరి అవి నిండాక రామన్న కతువకు చేరుకుంటుంది. నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం సమీపంలోని నీటి గుండంలోని గుండ్లకమ్మ వాగు ద్వారా భారీగా వరదనీరు చేరుతుండటంతో ఆలయానికి వెళ్లే మార్గం అంతటా నీటి మంచుతో కప్పుకునిపోయింది. రామన్నకతువలో నీరు చేరుతుండటంతో చోళ్లవీడు, చినగానిపల్లె, అచ్చంపేట, అక్కపల్లె, జేపీ చెరువు గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బోర్లకు సాగు నీరు అందుతుందని ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదేమి యాత్ర నాయనా..!

- లోకేష్ పాదయాత్ర చూసి ముక్కున వేలేసుకుంటున్న జనం
- సమస్యలు చెప్పేందుకు వచ్చిన మహిళలను సైతం ఈడ్చి పడేస్తున్న ప్రైవేటు సైన్యం
- ఈవినింగ్ వాక్‌లా నడుస్తూ వెళ్తూ.. ముఖాముఖి పేరుతో నారా షో
- మీటింగ్‌లలో సైతం పచ్చి అబద్ధాలు
- పాదయాత్ర పేరుతో భారీగా వసూళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పాదయాత్రలంటే .. జనంతో మమేకమవుతూ..సమస్యలు వింటూ...గ్రామాల్లో పరిస్థితులు గమనిస్తూ, నిరుపేదలు, మహిళలు ఇలా అన్ని వర్గాల కష్టాలు తెలుసుకోవడమే లక్ష్యంగా సాగాలి. గతంలో దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిల పాదయాత్రలు ప్రజా సమస్యలను తెలుసుకోవడమే ధ్యేయంగా సాగిన విషయం తెలిసిందే. లోకేష్ పాదయాత్ర మాత్రం అందుకు భిన్నంగా ''ఈవినింగ్ వాక్''లా సాగుతోంది. రాత్రి బస కేంద్రంలోకి వెళితే మరుసటి రోజు సాయంత్రం 4 గంటల వరకు టెంట్‌కే పరిమితమవుతున్న పరిస్థితి. సాయంత్రం 4 గంటలకు బయటకు వచ్చి కొద్దిసేపు సెల్ఫీలు దిగి రోడ్డుపైకి వచ్చి రాగానే మీటింగ్ జరిగే ప్రాంతానికి వెళ్లేందుకు పరుగులు పెడుతున్నారు. ఈ హడావుడిలో ఎవరైనా సమస్యలు చెప్పుకుందామని మహిళలు, వృద్ధులు దగ్గరకు రావాలని చూస్తే లోకేష్ ప్రైవేటు సైన్యం వారిని ఈడ్చి పడేస్తున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ బుధవారం ఒంగోలులో జరిగిన లోకేష్ పాదయాత్రలో చోటు చేసుకుంది. మహిళలను లోకేష్ ప్రైవేటు సైన్యం ఎత్తివేయడంతో కింద పడ్డారు. వారికి ఒంగోలు నగరంలోని ముంగమూరు రోడ్డు జంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభ సాక్షిగా లోకేష్ క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళలు, వృద్ధులను దగ్గరకు తీసుకుని, వారి కష్టాలు తెలుసుకుంటూ పాదయాత్ర చేయాల్సింది పోయి బాణాసంచా పేలుస్తూ, డప్పులు కొట్టుకుంటూ హంగామా చేస్తుండడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. లోకేష్ ప్రైవేటు సైన్యం పరిస్థితి ఎలా ఉందంటే, ఏమైనా గొడవలు జరుగుతాయేమోనని ముందు జాగ్రత్తగా ఫొటోలు తీస్తున్న పోలీసుల ఫోన్లు సైతం లాగేసుకుని వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. లోకేష్ పాదయాత్ర వీడియో తీస్తున్న ఓ స్పెషల్‌బ్రాంచ్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను లోకేష్ ప్రైవేటు సైన్యం లాక్కొని తిరిగి ఇవ్వకపోడంతో అడిషనల్ ఎస్పీ స్థాయి ద్వారా చెప్పించి ఫోన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా జిల్లాలో లోకేష్ పాదయాత్ర జరుగుతున్న తీరుపై ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు. అధికారం లేకపోతేనే వీరి పరిస్థితి ఇలా ఉంటే, ఇక అధికారంలోకి వచ్చాక మన సమస్యలు ఏం పట్టించుకుంటారంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించడం గమనార్హం. జిల్లాలో లోకేష్ పాదయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి 250 మంది పోలీసు సిబ్బంది భారీగా బందోబస్తు ఏర్పాటు చేసినా, లోకేష్ ప్రైవేటు సైన్యంతో హంగామా సృష్టిస్తూ ముందుకు సాగుతున్నారు. పోలీసులపై తన సొంత సైన్యం దౌర్జన్యానికి దిగుతున్నా పట్టించుకోని ఆయన సమావేశంలో మాత్రం వారిపై ప్రేమ ఒలకబోస్తూ తాము అధికారంలోకి వస్తే పోలీసుల సమస్యలు పరిష్కరిస్తానంటూ మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నడుచుకుంటూ వెళ్తున్న నారా లోకేష్

నోరు తెరిస్తే అబద్ధాలు... అభూత కల్పనలే....

లోకేష్ పాదయాత్రలో వాస్తవాలు తెలుసుకోకుండా అబద్ధాలు..అభూత కల్పన ప్రసంగాలతో అభాసుపాలవుతున్నారు. మంగళవారం సంతనూతలపాడు నియోజకవర్గంలో వాహనాల మెకానిక్‌లతో జరిగిన ముఖాముఖిలో తాను 8వ తరగతిలో బైక్ ఇంజన్‌తో కారు తయారు చేసి తిప్పానంటూ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అదే నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో ఇటీవల ఒంగోలులో జరిగిన ఒక సంఘటనకు సంబంధించి ఎస్టీ యువకుడు మోటా నవీన్‌పై రామాంజనేయ చౌదరితోపాటు, మరికొందరు దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టడంతో పాటు, ముఖంపైన మూత్రం పోసిన వైనంపై పోలీసులు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రామాంజనేయ చౌదరితోపాటు, ఎనిమిది మందిని ఈనెల 22వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపారు. సోమవారం సంతనూతలపాడు సభలో ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదివిన లోకేష్, ఆ సంఘటనలో నిందితులను ఇంత వరకు అరెస్టు చేయలేదంటూ మాట్లాడటంపై అందరూ అవాక్కయ్యారు. అదేవిధంగా ప్రకాశం జిల్లాతోపాటు, ఒంగోలు నగరంలో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు పూర్తి చేశామంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. అధికారిక సమాచారం ప్రకారం టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు 30 శాతం కూడా పూర్తి చేయని పరిస్థితి. అందులోనూ బకాయిలు చెల్లించకుండా వదిలేసి ప్రస్తుత ప్రభుత్వంపై భారం మోపి వెళ్లిన పరిస్థితి అందరికి తెలిసిందే. ఈవిషయం తెలుసుకోకుండా టీడీపీ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌లు చదువుతూ ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడటంపై రాజకీయ విశ్లేషకులు, ప్రజలు మండి పడుతున్నారు. పాదయాత్ర పేరుతో టీడీపీ నేతలు భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువవడంతో డబ్బులిచ్చి జనాలను తరలించారు.

దామచర్లకు శృంగభంగం...

లోకేష్ వద్ద మార్కులు కొట్టేసేందుకు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కాబోయే సీఎం లోకేష్ అంటూ తన అనుచరులతో నినాదాలు చేయించారు. దీంతో దామచర్ల దగ్గర ఉన్న మైకును తీసుకుని చివరకు టీడీపీలో నాకు ఏ పదవీ లేకుండా చేసేలా ఉన్నావంటూ లోకేష్ సెటైర్ వేసి ఝలక్ ఇచ్చారు. అంతే కాకుండా లోకేష్ ప్రసంగిస్తున్న సమయంలో డీజే..డీజే అంటూ అనుచరులతో నినాదాలు చేయించినా లోకేష్ పట్టించుకోలేదు. కొండపిలో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామిని మళ్లీ గెలిపించాలంటూ అతని చేయి పైకెత్తి చెప్పిన లోకేష్ ఒంగోలులో మాత్రం దామచర్లను గెలిపించండి అని చెప్పకుండా ఈ సారి ఇక్కడ టీడీపీ జెండా ఎగరాలి అని మాత్రమే చెప్పటంతో ఆయన వర్గం నిరాశకు గురయ్యారు. ఒంగోలు ప్రజలు సైతం ఈ సారి దామచర్లకు టిక్కెట్ డౌటే అని మాట్లాడుకోవటం కనిపించింది. లోకేష్ పాదయాత్ర షెడ్యూల్‌లో మొదట ఒంగోలు లేనప్పటికీ కోరిమరీ ఇక్కడకు పిలిపించుకున్నా ప్రయోజనం లేకపోయిందని దామచర్ల వర్గం తలలు పట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

ఫుడ్ ఫెస్టివల్ బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: విజయవాడకు వెళదాం..సీ ఫుడ్స్ తిందాం అంటూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ సంయుక్తంగా ఈ నెల 28 నుంచి 30 వరకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. బుధవారం ఫుడ్ ఫెస్టివల్ బ్రోచర్‌ను ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో అన్ని రకాల వంటకాలను అందుబాటులో ఉంచనున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి చంద్రశఖర్‌రెడ్డి తెలిపారు. ఈ పండుగలో పాల్గొని అన్ని రకాల సీ ఫుడ్స్ రుచులను ఆస్వాదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు మత్స్యశాఖ అధికారుల పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

- పొలాల్లోకి దూసుకెళ్లిన టూరిస్టు బస్సు


పంట కాలువలో ఇరుక్కుపోయిన టూరిస్టు బస్సు

కొమరోలు: ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రైవేట్ టూరిస్టు బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన కొమరోలు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్ నుంచి తిరుమలకు వెళుతున్న టూరిస్టు బస్సు కొమరోలు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో పొలంలోకి దూసుకెళ్లి పంట కాలువలో ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై ఎ.సుబ్బరాజు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపారు. పంట కాలువలో ఇరుక్కుపోయిన బస్సును జేసీబీతో బయటకు తీశారు. క్షేమంగా ప్రయాణికులను తిరుమల దర్శనానికి పంపారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం నుంచి బయట పడినట్లుగా ప్రయాణికులు తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసు సిబ్బందికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్ర'

- ఐదు దశల్లో ఆటల పోటీలు నిర్వహించాలి
- 17 ఏళ్లు నిండిన యువతీయువకులు అర్హులు
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్


అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు నుంచి 46 రోజుల పాటు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, వ్యాయమ ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్రలో క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను 5 దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 ఏళ్లు నిండిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. పోటీలు నిర్వహించేందుకుగాను క్రీడా మైదానాలకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని క్రీడాకారులను గుర్తించి శాప్ రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాలని, తదనుగుణంగా గ్రామస్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి, జిల్లా స్థాయి విజేతలను విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపాలని చెప్పారు. గెలుపొందిన జట్లకు ప్రభుత్వం నగదు బహుమతి అందిస్తుందని పేర్కొన్నారు. స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో క్రీడా సంబరాలు నిర్వహించాలని కోరారు. నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు. అలాగే క్రీడాకారులకు అవసరమైన వసతి, ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పోటీలకు విస్తృత ప్రచారం కల్పించాలని, ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో స్టెప్ సీఈఓ ఎంవీఎస్ లోకేశ్వరరావు, డీపీఓ నారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ టి.రవికుమార్, డీఈఓ సుబ్బారావు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా..?

- గిరిజన పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం
- నీళ్ల సాంబారు, గంజితో చెట్నీ
- కలెక్టర్, ఫుడ్ కమిటీ చైర్మన్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ ఫిర్యాదు
- హుటాహుటిన జిల్లా గిరిజన వెల్ఫేర్ ఆఫీసర్ సందర్శన


గిరిజన పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: 'నీళ్ల సాంబార్, నాణ్యత లేని నీళ్ల మజ్జిగ, ఇంట్లోకి గంజితో కలిపిన చెట్నీ. హాస్టల్‌లో భోజనం తినలేక పోతున్నామ'ని చీమకుర్తి గరికమిట్టలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాల బాలురు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గురుకుల పాఠశాలను బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేసే సమయానికి హాస్టల్‌లో వార్డెన్ శ్రీనివాసరావు అందుబాటులో లేడు. వార్డెన్ ఎక్కడకి వెళ్లాడని సిబ్బందిని అడిగితే వారానికి ఒకటి రెండు సార్లు వస్తారని సమాధానం చెప్పటంతో జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ వార్డెన్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మూడుసార్లు వచ్చినప్పుడూ భోజనం నాణ్యత సక్రమంగా లేకపోవడంతో అప్పట్లో హెచ్చరించారు. అయినా తీరు మార్చుకోకపోవడంతో వార్డెన్ పనితీరుపై వెంకాయమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మెనూ అమలు చేయకుండా ఇష్టం వచ్చినట్లు భోజన పెడుతున్నారని ఆగ్రహించారు. సైన్స్ టీచర్ లేకపోవడంతో సైన్స్ పాఠాలు చదువుకోవడం కష్టంగా ఉందని తెలిపారు. వార్డెన్ నిర్లక్ష్యం, భోజనం నాణ్యత లేకపోవడంపై కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఫుడ్ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి ఫోన్ ద్వారా బూచేపల్లి వెంకాయమ్మ ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మిని గురుకుల పాఠశాల సందర్శనకు పంపించారు. హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని వెంకాయమ్మ కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. అనంతరం విద్యార్థులకు వెంకాయమ్మ చేతుల మీదుగా భోజనం వడ్డించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత జిల్లా నుంచి గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి వార్డెన్ శ్రీనివాసరావుతో కలిసి వచ్చారు. భోజనం నాణ్యత సక్రమంగా లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. హాస్టల్ నిర్వహణను కూడా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని తెలిపారు.

యువతకు నైపుణ్య శిక్షణ

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఉన్న పరిశ్రమలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణలు ఇచ్చి ఉపాధి కల్పించే దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. బుధవారం ప్రకాశంభవనంలో జిల్లా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహక అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పరిశ్రమల అనుమతులు ఇతర అంశాలపై చర్చించారు. పరిశ్రమలకు సంబంధిత శాఖ నిర్వహించాల్సిన విధులను స్థానిక సచివాలయాల్లో అందుబాటులో ఉండే ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో చేయించుకునేలా అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలు అందచేయాలన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోడరైజేషన్ ఆఫ్ ఇన్‌స్టిటిట్యూట్స్, ఐటీఐ, ప్రభుత్వ పాలిటెక్నిక్, స్కిల్ కాలేజీలు పరిశ్రమలతో అనుసంధానమైతే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆ మేరకు పరిశ్రమలతో చేసుకున్న ఒప్పంద పత్రాలను ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు అందచేశారు. ఒప్పందం చేసుకున్న పరిశ్రమల్లో భగీరథ కెమికల్స్, ఆటోమోటివ్ మ్యాన్‌ఫ్యాక్చర్స్, కళ్లం టెక్స్‌టైల్స్, పెరల్ డిస్టిలరీస్ ఉన్నాయి. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జెడ్ఎం వెంకటేశ్వరరావు, లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ పవన్‌కుమార్, ఉపాధి కల్పన అధికారి భరద్వాజ్, సిడాప్ జేడీ రజనీకాంత్, పాలిటెక్నిక్ కాలేజి నుంచి శివప్రసాద్ ఇతర కాలేజీల అధికారులు యేసుప్రసాద్, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరి, బాషా, శ్రీనివాసాచారి ఇతర పరిశ్మరల పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.257

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 257 పలికింది. మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1000 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 956 కొనుగోలు చేసి 44 బేళ్ల తిరస్కరించారు. గరిష్ట ధర రూ.257, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 238.23గా నమోదైంది. వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం జిల్లా కోఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు నిండినవారు, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి 15 ఏళ్లు నిండిన వారు అర్హులని స్పష్టం చేశారు. ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలు, ఉత్తీర్ణత సర్టిఫికెట్లు నేరుగా విద్యార్థుల చిరునామాకు పంపుతామని పేర్కొన్నారు. ఏపీ ఓఎస్ఎస్ జ్ఞానధార అనే ప్రత్యేక యూట్యూబ్ చానల్ ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలు నేర్చుకునే సౌలభ్యం ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేరస్తుల కదలికలపై నిఘా పెట్టండి

- అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు


విచారణ చేస్తున్న అదనపు ఎస్పీ

మార్కాపురం: మార్కాపురం సబ్‌డివిజన్‌లో జరుగుతున్న దొంగతనాలు, నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని జిల్లా అదనపు ఎస్పీ క్రైం శ్రీధర్‌రావు స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. పట్టణ శివార్లలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ ఆటో షోరూమ్‌లో మంగళవారం దొంగతనం జరిగింది. రూ.5 లక్షల నగదు, ల్యాప్‌ట్యాప్‌ను అపహరించారు. ఈ నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ బుధవారం పట్టణంలో కాలేజీ రోడ్డులో దొంగతనం జరిగిన షోరూంను పరిశీలించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ భీమానాయక్ పలు సూచనలు చేశారు. దొంగతనం జరిగిన షోరూం సీసీ ఫుటేజీ హార్డ్‌డిస్క్‌ను దొంగలు తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నైట్ బీట్‌లను పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులను వెంటనే అదుపులోనికి తీసుకుని విచారణ చేయాలని ఆదేశించారు. కేసులో నిందితులను పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ భీమానాయక్ అదనపు ఎస్పీకి చెప్పారు.

ఆగిన లారీని ఢీకొట్టిన బైకర్

- 108లో ఒంగోలు తరలిస్తుండగా మృతి


కొండపి ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రుడు మస్తాన్‌వలి

కొండపి: స్థానిక టంగుటూరు రోడ్డులో గురుకుల పాఠశాల సమీపంలో ఆగి ఉన్న సిమెంట్ లారీని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(48) కొండపిలో టైలర్ వృత్తి చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. పని ముగిసిన తర్వాత ఇంటికెళ్లే క్రమంలో స్థానిక పెట్రోలు బంకు–గురుకుల పాఠశాల మధ్య రోడ్డుపక్కన ఆగి ఉన్న సిమెంటు లారీని చీకటిలో గమనించక వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మస్తాన్‌వలిని అటుగా వెళ్తున్న కొందరు చూసి 108కి సమాచారం అందించారు. కొండపి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్యాపిల్లలు ఉన్నారు.

అన్ని విధాలా న్యాయం చేస్తాం

- గిరిజన యువకుడు నవీన్‌కు బాలినేని భరోసా


నవీన్‌ను పరామర్శించి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు టౌన్: ఇటీవల ఒంగోలు నగర శివారులో జరిగిన దాడి ఘటనలో బాధితుడైన గిరిజన యువకుడు మోటా నవీన్‌కు అన్ని విధాలా న్యాయం చేకూరుస్తామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. బుధవారం జయప్రకాష్ కాలనీలో బాధితుడు నవీన్‌ను పరామర్శించారు. ఘటన గురించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. దాడి జరిగిన తీరు అత్యంత అమానవీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ దాడిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారని, నిందితులను కఠినంగా శిక్షించాలని, నవీన్ కుటుంబానికి సత్వరం న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తన కుమారుడికి జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని నవీన్ తల్లి కాశమ్మ కోరగా ముఖ్యమంత్రితో మాట్లాడి బాధితుడికి ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పరంగా త్వరగా సాయం అందేలా చూడమని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా రామానాయుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, కార్పొరేటర్లు అంబటి ప్రసాదరావు, శ్రీరామ నాగభూషణం, డివిజన్ నాయకులు మల్లీశ్వరి, చక్రపాణి, టి.అజయ్, అనుమాటి ఏడుకొండలు, తోటపల్లి రవి, కోటపూడి మారుతి, నుసుమ చంద్ర, కొత్తకోట శ్రీను తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఎమ్మెల్యేతో సంభాషణను వక్రీకరించారు


మాట్లాడుతున్న కాంట్రాక్టర్ ఎక్కలూరి గోపాల్‌రెడ్డి

పామూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌తో మాట్లాడిన మాటలను ఎల్లో మీడియా వక్రీకరించిందని అక్కంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కాంట్రాక్టర్ ఎక్కలూరి గోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేణిమడుగులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను కార్యకర్తలతో కలిసి వెళ్లి విజయవంతం చేశామన్నారు. తాను కంబాలదిన్నె సచివాయం కాంట్రాక్ట్ తీసుకుని నిర్మించగా..బిల్లుకు సంబంధించి రావాల్సిన రూ..4 లక్షల గురించి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ దృష్టికి వెళ్లగా...ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే ఫైనల్ బిల్లు వస్తుందని హామీ ఇచ్చారన్నారు. గడప గడపకూ కార్యక్రమం ముగింపు వరకు వెంటే ఉన్నామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఎల్లో మీడియా ఇలాంటి కథనాలు ప్రచురించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీసెల్ నాయకులు గంధం బాస్కర్, కోటపాటి రవికుమార్‌రెడ్డి, గోవిందు కొండారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

- జగనన్న కాలనీల్లో త్వరగా విద్యుత్ కనెక్షన్లు
- విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీ సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

మార్కాపురం: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరాపై దృష్టి సారించామని జిల్లా విద్యుత్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. మార్కాపురం విద్యుత్ డీఈ కార్యాలయంలో బుధవారం డివిజన్‌లోని విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకూ డివిజన్‌లో 635 ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయినట్లు గుర్తించామన్నారు. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేస్తున్నామని, ఇప్పటికే పలు చోట్ల బిగించామని తెలిపారు. 48 గంటల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోవడంపై పరిశీలన చేస్తున్నామని, ప్రతి లైన్‌మన్ తన పరిధిలో వారానికి 5 ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేయాలని చెప్పారు. భవిష్యత్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు పంట నష్టం కాకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, దీంతో పాటు పగటిపూటే రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో మార్కాపురం డివిజన్‌లో తరచుగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు ఎక్కువయ్యాయని పోలీసులతో పాటు తమ సిబ్బంది కూడా రైతులతో కలసి పెట్రోలింగ్ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ సుమారు లక్షన్నర రూపాయల వరకూ ఖర్చువుతుందని రైతులు కూడా దొంగతనాలు జరగకుండా కాపాడుకోవాలన్నారు.

ఆగస్టు 15 లోగా కొత్త కనెక్షన్లు

మార్కాపురం డివిజన్‌లో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకూ మొత్తం 500 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ ఆగస్టు 15 లోగా కొత్త కనెక్షన్లు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి రైతులు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల లోగా కలెక్షన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పగటిపూట విద్యుత్ సరఫరా చేయడంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు.

జగనన్న లేఅవుట్లలో విద్యుత్ కనెక్షన్లు

డివిజన్‌లో జగనన్న లేఅవుట్లలో త్వరగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించినట్లు సత్యనారాయణ తెలిపారు. దాదాపు 600 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించామని ఈ నెలాఖరుకు వీటిని పూర్తి చేయాలని తెలిపారు. డివిజన్‌లో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు తెలుస్తోందనీ తగ్గించేందుకు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశామన్నారు. సమీక్షలో ఈఈ నాగేశ్వరరావు, డీఈ షియా నాయక్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

పామూరు: ఇంటి శ్లాబ్ హుక్‌కు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం పామూరు చిత్రాలయ వీధి సమీపంలోని వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు... కనిగిరి మండలం కంఠంవారిపల్లె గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లు(25) మూడేళ్లుగా పామూరులో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ చిత్రాలయవీధి సమీపంలో ఓఇంటి పైగదిలో అద్దెకు ఉంటున్నాడు. వెంకటేశ్వర్లు ఉండే గదిపైన ఉండే కొందరు రెండు రోజులుగా వెంకటేశ్వర్లు చెప్పులు బయటే ఉండటం రాకపోకలు లేకపోవడం గమనించి ఇంటి యజమానికి సమాచారం అందించారు. దీంతో వారు గదివద్దకు వచ్చి పోలీసులకు, వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గది వద్దకు చేరుకున్న పోలీసులు, వెంకటేశ్వర్లు బంధువులు కిటీకిని పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా వెంకటేశ్వర్లు ఉరేసుకొని కనిపించాడు. పంచాయతీ సిబ్బంది, మృతుని బంధువుల సాయంతో మృతదేహాన్ని కిందకు దింపి అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు మృతిపై వివరాలు సేకరించి, గదిని పరిశీలించి సాక్ష్యాల కోసం గాలించారు. మృతుని తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతునికి తల్లి, తండ్రి, ఇద్దరు అక్కలు ఉన్నారు. కాగా మృతుడు సోమవారం సాయంత్రం కొందరితో మాట్లాడినట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు.

వారంలో వస్తానని..

వారం రోజులక్రితం దుస్తులు ఉతికించుకునేందుకు స్వగ్రామమైన కఠంవారిపల్లెకు వచ్చాడని మృతుడి తండ్రి శ్రీనివాసులు తెలిపారు. ఓ ఇల్లు వైరింగ్ ఒప్పుకున్నానని, వారం రోజుల్లో పూర్తి చేసి వస్తానని చెప్పి ఇలా మృత్యువాత పడ్డాడని శ్రీనివాసులు కన్నీరు మున్నీరుగా విలపించాడు.